# దేశభక్తి

చింతా దీక్షితులుగారు [సాహితీ సమితి]

౧

మేమిద్దరమున్నూ సహాయ నిరాకరణోద్యమములో ప్రవేశించి చాలా పనిచేసిన వాళ్లమే. ఈమధ్యను దేశం చప్పచప్పగా ఉండడంవల్ల మేమున్నూ వెనకకు తగ్గాము కాని మాదుస్తులలోనూ, వేషభాషలలోనూ, మనస్సులోనూ ఏమీ మార్పులుమాత్రం కలగలేదు. ఆనాటినుండి నేటివరకూ ఖాదీబట్టలు కట్టుకొని గాంధీటోపీ పెట్టుకుంటూనే ఉన్నాము. దేశముకు స్వరాజ్యము వచ్చే పసందైన ఉద్యమం మళ్లీ వచ్చిందంటే మేము ఆశాంతియుద్ధములో ప్రవేశించి దేశముకోసము ప్రాణత్యాగమైనా చెయ్యడానికి సిద్ధముగా ఉన్నవాళ్లమే. మా దేహములు, మాఆత్మలూ దేశభక్తితో నిండి ఉన్నవి. మా మాతృభూమి అన్నప్పుడు మా దేహములో రక్తము వేగముగా ప్రవహిస్తుంది. దేహము గగుర్పొడుస్తుంది. మా ఆత్మ తాండవిస్తుంది.

౨

ఒకయేటి శివరాత్రికి మేము శ్రీశైలపర్వతము వెళ్లినాము. తెలుగు దివ్యక్షేత్రమును కళ్లారా చూడగానే మాకు మా మాతృభూమిదుర్దశ కళ్లకు కట్టినట్లయినది. అక్కడ మల్లిఖార్జునుడికి మ్రొక్కుకున్నాము. భ్రమరాంబముందు సాగిలబడ్డాము. కృష్ణవేణికి అంజలులు ఘటించినాము. మాకు దాస్యవిమోచన చెయ్యరా అని ప్రార్థించినాము. మా ప్రార్థనలకు బదులు వచ్చినట్లు మాఆత్మలు గ్రహించ లేదు.

శ్రీశైలప్రాకారములోపల పశ్చిమగోపురములో అరుగుమీద ఒక ముని కూర్చుని తపస్సు చేసుకొంటున్నాడు. ఆతని సమీపించాము. అతడు కళ్లు మూసికొని సమాధిలో ఉన్నాడు. చుట్టుపట్టుల అనేకమంది చేరి ఆయనమహాత్తు ఉగ్గడిస్తున్నారు. మనస్సును చిక్కబట్టి, ఇంద్రియముల జయించి, పరమాత్మ సాన్నిధ్యమును కల్పించుకొని ఎప్పుడూ మననము చేస్తూ ఉంటాడట ఆమహానుభావుడు.

ఆయనతో ప్రసంగిస్తేనే కాని తిరిగి రాకూడదని మేము నిశ్చయించుకొన్నాము.

రాత్రి అయినది. చీకటులు బాగా ఆవరించుకొన్నవి. అక్కడి వాళ్లందరూ ఒకరితరువాత ఒకరు వెళ్లిపోయారు. అర్ధరాత్రి అయినది. తైర్థికు లందరూ నిద్రపోయేవారూ, ప్రసంగించుకొనేవారూ, భజనచేసేవారున్నూ. వారందరూ దూరముగా ఉన్నారు. ముని ఇంకా తపస్సులోనే ఉన్నాడు. రాత్రి మూడుజాములు గడచి నాల్గవజాము ప్రవేశించినది. తీర్థయాత్రాపరులు చాలామంది నిద్రపోతున్నారు. జాగరణమున్న వారు మాత్రము తడిబట్టలతో కళ్లు తడుపుకొంటున్నారు.

నాల్గవజాము సగము గడిచింది. అప్పుడు ముని కళ్లు తెరిచాడు. లేచాడు. అది కనిపెట్టి మే మాయనకు నమస్కరించాము. ఆయన కనురెప్పపాటుతో మానమస్కార మందుకొన్నట్లు తోచినది. నక్షత్రకాంతిలో అయన మా ముఖములు పరిశీలించి చూచాడు. ఒక్కనవ్వు నవ్వాడు. నవ్వి స్నానార్థమై బయలుదేరాడు. మే మాయన వెంట బడ్డాము.

## 3

ఒకతాళముల నూతిలో ఆయన ప్రవేశించి స్నానము చేస్తున్నాడు. మేము నూతి గుమ్మము దగ్గర నిలబడ్డాము. ఆయన స్నానము చేస్తూ స్నానము చేస్తూ బయటికి వచ్చి నాస్నేహితుణ్ణి ముట్టుకొన్నాడు. ముట్టుకొని వింటున్నావా అన్నాడు నాతో.

"చిత్తం, వింటున్నాను" అన్నాను.

అతడు మావాడిని ఈవిధముగా ప్రశ్నించాడు:

"మీది ఏ దేశం ?"

"ఇంగ్లాండు."

"నీకు ఉద్యోగ మేమిటి?"

"మంత్రివర్గములో ఉన్నాను."

"హిందూదేశపు విషయాలు నీకు బాగా తెలుసునా?"

"ఆవిషయమై నేను కృషిచేసి బాగా చదువుకొన్నాను."

"వాళ్లు స్వరాజ్యానికి అర్హులేనా?"

"ఆసంగతి నేను చర్చించను."

"పోనీ, వాళ్లకు స్వరాజ్యం ఇవ్వడానికి నీకేమైనా అభ్యంతరం ఉందా?"

"ఉంది."

"ఏమిటది?"

"మా దేశక్షేమము ముందు చూచుకోవడం మావిధి. మా దేశక్షేమానికి భంగకరం కాబట్టి స్వరాజ్యం వాళ్లకు ఈయ వీలులేదు."

ముని నావైపు తిరిగి చూశాడు. ఆమాట్లాడుతున్నది మావాడేనా అని సందేహం తోచింది నాకు.

"అమాట్లాడుతున్నది మీవాడే. మీ వాడిప్పుడు భారతీయుడు గాడు. ఆంగ్లేయుడు" అన్నాడు ముని.

"అయితే మీమహత్తువల్ల ఆలాగున మాట్లాడించారన్నమాట."

"ఇందులో నామహత్తు ఏమీ లేదు. అతని మనస్సు నేను మార్చలేదు. దేశము మాత్రము మార్చాను" అన్నాడాముని.

నాస్నేహితు డిట్లా మారుతాడని నే నెప్పుడూ అనుకోలేదు.

ఇంతట్లోకే ముని వచ్చి మావాడిని మళ్లీ ముట్టుకొన్నాడు. ముట్టుకొని ఈరీతిగా ప్రశ్నించాడు:

"ఏ ఊరు నీది?"

"అమెరికా."

"ఏమిటి నీ ఉద్యోగం?"

"ప్రజాసభలో సభ్యుడను."

"హిందువులకు పౌరస్వత్వము ఇచ్చుటకు నీ కేమైనా అభ్యంతర మున్నదా?"

"ఆ."

"ఏమి టది?"

"అది మా దేశముకు క్షేమకరము కాదు."

ఏరంగు చిమ్నీ పెట్టితే ఆరంగు దీపకాంతి వచ్చినట్లు నా స్నేహితుడు మారిపోవడం చూచి నే నాశ్చర్య పడ్డాను.

"చాలునా?" అన్నాడు ముని నావంక తిరిగి.

"చాలును" అన్నాను.

"అయితే వెళ్లండి. నీవూ నీస్నేహితుని వంటి వాడవే. ఈవిషయములో నిజమైన హిందూత్వమే మీలో ఉంటే ఎక్కడ నున్నా ఒక్కటే పలుకు పలికేవారు. వెళ్లండి. దిగులుపడకండి. ఈదేశంలో మీవంటి వాళ్లనేకు లున్నారు. మానవభ్రాతృత్వం అంటే ఏమిటో తెలిసిన మీగురువును బాగా అర్థముచేసుకోండి." అని ఆయన నాస్నేహితుణ్ణి వచ్చి ముట్టుకొన్నాడు. నాస్నేహితుడు నిద్రలోనుండి మేల్కొన్నాడు. మే మిద్దరమూ ఆయన్ని మళ్లీ పలకరించాలని ప్రయత్నము చేశాము గాని ఆయన పలకలేదు. మేము తిరిగివచ్చాము.

౪

నే నడిగాను నాస్నేహితుణ్ణి—"ఏమి జరిగిందో నీకేమైనా జ్ఞాపక మున్నదా" అని.

"నాకేమీ జ్ఞాపకము లేదు. అంతా స్వప్నప్రాయముగా ఉన్న" దన్నాడు. "స్వప్న మేమైనా జ్ఞాపక మున్నదా" అన్నాను.

"ఏమీ లేదు కాని, ఈ నాబానిసత్వము పోయినట్లూ, స్వాతంత్ర్య మదముతో నే నున్నట్లూ అనుకొన్నాను. ఆ ఉత్సాహవాసన ఇప్పుడిప్పుడే క్రమంగా నామనస్సును విడిచిపోతూ ఉన్నది."

"సరే కాని, నేను నిన్ను రెండుప్రశ్న లడుగుతాను, సమాధానం చెప్పు."

"అలాగే."

"నీవే ఇంగ్లీషువాడవై, వాళ్ల మంత్రివర్గంలో నీవే ఉన్నట్లయితే మన దేశానికి స్వరాజ్యం ఇప్పించడానికి ప్రయత్నిస్తావా?"

"ప్రయత్నించడమా! రేపటికి వచ్చేలాగ చెయ్యనూ?"

"సరే, ఆగు. నీవే ఆమెరికాదేశస్థుడవై ప్రజాసంఘములో సభ్యుడవైనట్లయితే హిందువులకు పౌరస్వత్వము ఇప్పిస్తావా?"

"తప్పకుండా."

---